క్లుప్తంగా

పార్కు అభివృద్ధి పనుల పరిశీలన



పటమట(విజయవాడతూర్పు): నగరంలోని డాక్టర్ కేఎల్‌రావు పార్కులో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని మేయర్ రాయన భాగ్యలక్ష్మి ఆదేశించారు. నగర పర్యటనలో భాగంగా గురువారం ఆమె అధికారులతో కలసి 46వ డివిజన్ పరిధిలోని పార్కును సందర్శించారు. అభివృద్ధి పనులపై ఆరా తీశారు. పార్కులో స్థానికులకు బ్యాడ్మింటన్ కోర్టు, స్కేటింగ్ రింక్, పిల్లల ఆటపరికరాల ఏర్పాటు పనులు పూర్తిచేయాలని, నిరంతరం పరిశుభ్రంగా, పచ్చదనంగా ఉంచాలని అధికారులకు సూచించారు. ఈ పర్యటనలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఏఎస్ఎన్ ప్రసాద్, పార్క్ కాంట్రాక్టర్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి లేపాక్షి గాంధీ శిల్పబజార్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వినియోదారులకు కనువిందు చేసే లేపాక్షి హస్తకళతో ఈ నెల 17వ తేదీ నుంచి నగరంలో లేపాక్షి గాంధీ శిల్పబజార్ నిర్వహిస్తున్నట్లు మేనేజింగ్ డైరెక్టర్ ఎం. బాలసుబ్రహ్మణ్యంరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తమిళనాడు, కేరళ, కర్ణాటక, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, ఒడిశా, గుజరాత్ తదితర రాష్ట్రాల నుంచి అధునాతన డిజైన్లతో తయారుచేసిన హస్త కళారూపాలను 100 స్టాళ్ల ద్వారా ప్రదర్శించనున్నట్లు తెలిపారు. విజయవాడ పిన్నమనేని పాలీక్లినిక్ రోడ్డులోని సిద్ధార్థ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాల మైదానంలో ఈ నెల 17 నుంచి 26వ తేదీ వరకు 10 రోజులపాటు గాంధీ శిల్పబజార్ జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

వీఎంసీ పీఆర్వో పోస్టుకు నోటిఫికేషన్

పటమట(విజయవాడతూర్పు): వీఎంసీలో పబ్లిక్ రిలేషన్ అధికారి(పీఆర్వో) పోస్టుకు వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ గురువారం నోటిఫికేషన్ విడుదల చేశారు. ఎంపికైన అభ్యర్థులకు కాంట్రాక్ట్ ప్రాతిపదికన నెలకు రూ. 40 వేల వేతనం అందిస్తామని, వీఎంసీ అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రసార మాధ్యమాల ద్వారా ప్రజలకు చేరువ చేసేందుకు విధుల నిర్వహించాల్సి ఉందని తెలిపారు. అభ్యర్థులకు జర్నలిజం డిప్లమో అర్హతతో, లక్ష కంటే ఎక్కువగా సర్క్యులేషన్ కలిగిన దిన పత్రికల్లో (ప్రింట్ మీడియా)లో మూడేళ్లు, టీవీ చానల్స్‌లో (ఎలక్ట్రానిక్ మీడియా)లో ఒక ఏడాది అనుభవం ఉండాలని, 25 నుంచి 40 ఏళ్ల మధ్య వయస్సు ఉన్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు తమ సర్టిఫికెట్ నకళ్లను జతపరిచి బయోడేటాతో వీఎంసీ ప్రధాన కార్యాలయంలో ఈనెల 27వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

ఆస్తి పన్నుపై వడ్డీ మాఫీ

పటమట(విజయవాడతూర్పు): నగరపాలక సంస్థకు చెల్లించాల్సిన ఆస్తి పన్ను, ఖాళీ స్థలం పన్నులపై వడ్డీ మాఫీ చేస్తూ గురువారం మున్సిపల్ శాఖ ప్రత్యేక కార్యదర్శి శ్రీలక్ష్మీ జీఓ ఎంఎస్ 34 విడుదల చేశారు. పన్నుపై వడ్డీ మాఫీ అవకాశం ఈ నెల 31వ తేదీ వరకు మాత్రమే ఉందని, వీఎంసీ పరిధిలోని బకాయిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.

ఏటీఎం నగదును పక్కదారి పట్టించిన వ్యక్తికి ఏడాది జైలు

విజయవాడ స్పోర్ట్స్: ఏటీఎంలో నగదును పక్కదారి పట్టించి మోసం చేసిన వ్యక్తికి ఏడాది జైలు శిక్ష విధిస్తూ విజయవాడ ఒకటో అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ కోర్టు న్యాయమూర్తి టి.వి.ఎస్.ఎస్.ప్రకాష్ గురువారం తీర్పు చెప్పారు. లోగిక్యాష్ సొల్యూషన్స్ ప్రయివేట్ లిమిటెడ్ సంస్థ నగరంలో పలు ఏటీఎంలలో నగదును నింపుతుంటుంది. ఈ కంపెనీలో పని చేసే పంచకర్ల ఈశ్వరరావు ఏటీఎంలలో నగదు నింపకుండా రూ. 34.86 లక్షలను వాడుకున్నాడు. 2016 మే 25వ తేదీన వెలుగు చూసిన ఈ ఘటనలపై సత్యనారాయణపురం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. నిందితుడిని 2017 మే మూడో తేదీన పోలీసులు అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చారు. ఆరుగురు సాక్షులను విచారించిన అనంతరం నేరం రుజువు కావడంతో నిందితుడుఈశ్వరరావుకు జైలు శిక్షతో పాటు రూ. 2,500 జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

లయోలలో సెమినార్

గుణదల(విజయవాడతూర్పు): ఆంధ్ర లయోల ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యాన కళాశాల ప్రాంగణంలో గురువారం గణిత నమూన, భేదాత్మక సమీకరణాలు, వాస్తవ ప్రపంచ సమస్యలు అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. కళాశాల డైరెక్టర్ రెవరెండ్ ఫాదర్ డాక్టర్ ఫ్రాన్సిస్, అసిస్టెంట్ డైరెక్టర్ ఫాదర్ బాలస్వామి, ఫాదర్ రవీంద్ర, ప్రిన్సిపాల్ డాక్టర్ మహేష్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. జేఎన్‌టీయూ ప్రొఫెసర్ డాక్టర్ జీవీఎస్ఆర్ దీక్షితులు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. సెమినార్‌లో డాక్టర్ వెంకటరమణారెడ్డి, కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

శ్మశానవాటికకు కొత్తరూపు



హిందూ శ్మశానవాటికలో జరుగుతున్న అభివృద్ధి పనులు



గ్యాస్ క్రిమిటోరియంలో పరికరాలు

- విద్యాధరపురంలో హిందూ శ్మశానవాటిక అభివృద్ధి
- అధునాతన గ్యాస్ క్రిమిటోరియం ఏర్పాటు

భవానీపురం(విజయవాడ పశ్చిమ): ఒకప్పుడు చెట్లు, పుట్టల మధ్య దర్శనమిచ్చే శ్మశానవాటికలకు కొత్తరూపు వస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం శ్మశానవాటికలను స్వర్గధామాలకు మారుస్తోంది. గత ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యానికి గురైన విద్యాధరపురం హిందూ శ్మశానవాటిక వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత అభివృద్ధి బాట పట్టింది. వీఎంసీ రూ.60 లక్షల వ్యయ అంచనాతో ఇక్కడ గ్యాస్ ఆధారిత క్రిమిటోరియం ఏర్పాటుచేసింది. ఇక్కడ మృతదేహాలు కరెంట్‌తో కాకుండా చాంబర్‌లోని గ్యాస్ బర్నర్స్ ద్వారా వచ్చే మంటతో దహనం అవుతాయి. ఇలాంటి క్రిమిటోరియం అజిత్‌సింగ్‌నగర్, విద్యాధరపురం హిందూ శ్మశానవాటికల్లో ఆయా ప్రాంత ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి. ఇప్పటికే ఇక్కడ కట్టెలతో దహనం చేసేందుకు రెండు ఖానాలతోకూడిన ఒక షెడ్ ఉంది. అయితే గ్యాస్ ఆధారిత క్రిమిటోరియం ద్వారా అతి తక్కువ చార్జితో దహనం చేసుకునే అవకాశం కలిగింది.

వేగంగా అభివృద్ధి పనులు

ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు చొరవతో హిందూ శ్మశానవాటిక రూపురేఖలు మారిపోయాయి. గ్యాస్‌క్రిమిటోరియంతోపాటు దహన సంస్కారాలు చేయడానికి వచ్చిన వారు అంత్యక్రియలు పూర్తయ్యే వరకు ఉండటానికి రూ.6 లక్షలతో షెడ్డు నిర్మించారు. అస్తికలు భద్రపరచేందుకు, టాయిలెట్లకు విడివిడిగా గదులు నిర్మించారు. ప్రత్యేకంగా జనరేటర్ ఏర్పాటు చేశారు. శ్మశానవాటిక లోపలకు రావడానికి వీలుగా పాత్‌వే నిర్మించారు. ఇక్కడ గ్రీనరీకి వీఎంసీ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.అయితే ఇక్కడ వాచ్‌మెన్/కాటికాపరిని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని స్థానికులు అంటున్నారు.

కర్మల భవనం ఏర్పాటుకు ప్రణాళిక



శ్మశాన వాటిక బయట కర్మల భవనాన్ని నిర్మించడానికి వీఎంసీ అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. లోపల గ్రీనరీ ఏర్పాటు చేస్తున్నారు. శ్మశాన వాటిక అభివృద్ధికి అవసరమైన నిధులు ఎమ్మెల్యే వెలంపల్లి మంజూరు చేస్తున్నారు.

– షేక్ రెహమతున్నీసా, 38వ డివిజన్ కార్పొరేటర్

ప్రశాంతంగా పరీక్షలు రాయాలి

టెన్త్ విద్యార్థులతో కలెక్టర్ ఢిల్లీరావు



బాపనయ్య హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఢిల్లీరావు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): టెన్త్ విద్యార్థులు ఒత్తిడి లేకుండా, ప్రశాంతంగా పరీక్షలు రాయాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు అన్నారు. పదో తరగతి పరీక్షలు సమీపిస్తుండటంతో కలెక్టర్ ఢిల్లీరావు గురువారం పాతబస్తీలోని తెలప్రోలు బాపనయ్య హైస్కూల్‌ను పరిశీలించి విద్యార్థులతో ముచ్చటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పాఠాల్లోని భావాన్ని అర్థం చేసుకుని పరీక్షలు రాయాలన్నారు. పది పరీక్షలకు కేవలం పదిహేను రోజులే వ్యవధి ఉందన్నారు. ఈ సమయం కీలకమన్నారు. విద్యార్థుల్లో పోటీతత్వం ఉండాలని పేర్కొన్నారు. పదో తరగతి జీవితానికి మలుపన్నారు. విద్యార్థులను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని చెప్పారు. విద్యలో వెనుకపడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. నూరు శాతం ఫలితాలను సాధించి పాఠశాలను అగ్రగామిగా నిలపాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ మాధురి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

జనరంజక పాలన ఓర్వలేని టీడీపీ

దేవినేని అవినాష్



చీరలు పంపిణీ చేస్తున్న దేవినేని అవినాష్, బొప్పన భవకుమార్ తదితరులు

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): సీఎం జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్రంలో అందిస్తున్న జనరంజక పాలనను చూసి టీడీపీ నేతలు ఓర్వ లేక ఇదేం ఖర్మ అంటూ రోడ్డున పడి అవాస్తవాలను ప్రచారం చేస్తున్నారని వైఎస్సార్ సీపీ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్ అన్నారు. గురువారం 8వ డివిజన్ గాయత్రీనగర్‌లో వైఎస్ఆర్ చారిటీస్ ఆధ్వర్యంలో ఉగాది సందర్భంగా మహిళలకు చీరల పంపిణీ కార్యక్రమం జరిగింది. అవినాష్ మాట్లాడుతూ చంద్రబాబునాయుడు రాష్ట్రాన్ని దోచుకుని, సంక్షేమాన్ని మరిచాడన్నారు. చంద్రబాబు అరాచక పాలనకు విసుగుచెందిన ప్రజలు జగన్‌మోహన్‌రెడ్డికి అధికారం అప్పగించారని చెప్పారు. వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు బొప్పన భవకుమార్ మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి కులమతాలు, పార్టీలు చూడకుండా అర్హులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందజేస్తున్నారని చెప్పారు. డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, కార్పొరేటర్ అంబడిపూడి నిర్మలకుమారి, నేతలు వై.జయ, గల్లా రవి, భీమిశెట్టి బాబు, ధనశేఖర్, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

పున్నమి ఘాట్ అభివృద్ధికి చర్యలు తీసుకోండి



పున్నమిఘాట్‌లో అధికారులతో కలిసి పరిశీలిస్తున్న వెలంపల్లి

భవానీపురం(విజయవాడపశ్చిమ): భవానీపురం పున్నమిఘాట్ వద్ద చేయాల్సిన అభివృద్ధి పనులను పరిశీలించడానికి ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, మేయర్ రాయన భాగ్యలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, వివిధ విభాగాల అధికారులతో కలిసి గురువారం పర్యటించారు. పున్నమిఘాట్ పరిసర ప్రాంతాల్లో ఉన్న విద్యుద్దీపాలను ఆధునీకరించి నదీ తీర ప్రాంతాన్ని పరిశుభ్రంగా ఉంచడానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సందర్శకులకు ఇబ్బంది లేకుండా అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ స్టాండింగ్ కమిటీ సభ్యులు యరడ్ల ఆంజనేయరెడ్డి, ఎన్టీఆర్ జిల్లా గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు కేసరి కృష్ణారెడ్డి, భవానీపురం సీఐ ఎండీ ఉమర్ తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాలకూ ప్రాధాన్యం

- జనరంజక బడ్జెట్
- హర్షం వ్యక్తం చేస్తున్న ఆయా వర్గాలు

లబ్బీపేట(విజయవాడతూర్పు): రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి గురువారం అసెంబ్లీలో ప్రవేశ పెట్టిన 2023–24 బడ్జెట్ జనరంజకంగా ఉందని పలు వర్గాల వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సంక్షేమంతో పాటు, అభివృద్ధికి పెద్దపీట వేశారని అభిప్రాయపడుతున్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు పెద్ద ఎత్తున నిధులు కేటాయించడం గొప్ప విషయమంటున్నారు. పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధికి, వార్డు, గ్రామ సచివాలయాలకు నిధులు కేటాయించడం స్వాగతించే విషయమంటున్నారు. యువత స్కిల్ డెవలప్‌మెంట్‌కు ఏకంగా రూ. 1.166 కోట్లు కేటాయించడం శుభపరిణామం అని పేర్కొంటున్నారు. రాష్ట్ర బడ్జెట్‌లో వైద్య ఆరోగ్య రంగానికి రూ. 15,882 కోట్లు కేటాయించడం చరిత్రలో ఇదే మొదటి సారి అని వైఎస్సార్ సీపీ వైద్య విభాగం ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు అంబటి నాగరాధకృష్ణ యాదవ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

వైద్యరంగానికి పెద్ద పీట



బడ్జెట్‌లో వైద్య రంగానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇచ్చింది. వైద్య ఆరోగ్యం, కుటుంబ సంక్షేమానికి ఏకంగా రూ.15,882 కోట్లు కేటాయించడం మంచి పరిణామం. అందరికీ సూపర్‌స్పెషాలిటీ వైద్యం ఉచితంగా అందించాలనే లక్ష్యంతోనే ప్రభుత్వం ముందుకు సాగుతోంది.

–డాక్టర్ మెహబూబ్ షేక్, జోనల్ ఇన్‌చార్జి వైఎస్సార్‌సీపీ వైద్య విభాగం

ఉద్యోగ, ఉపాధి అవకాశాలు



రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చింది. ముఖ్యంగా యువత స్కిల్ డెవలప్‌మెంట్ కోసం రూ.1166 కోట్లు కేటాయించడం హర్షణీయం. యువజనాభివృద్ధి, పర్యాటక, సాంస్కృతిక శాఖకు రూ.1291 కోట్లు కేటాయించడం శుభపరిణామం.

– కొరివి చైతన్య, జిల్లా అధ్యక్షులు, యువజన విభాగం, వైఎస్సార్‌సీపీ, ఎన్టీఆర్‌జిల్లా

ఈ ఏడాది కాపుల బడ్జెట్ పెంపు



కాపుల సంక్షేమానికి రూ.4,887 కోట్లు కేటాయించడం అపూర్వం. రాష్ట్రంలో అత్యధికంగా ఉన్న కాపుల సంక్షేమాన్ని గత పాలకులు విస్మరించారు. గత ఏడాది రూ.3,532 కోట్లు కేటాయించిన ప్రభుత్వం ఈ ఏడాది పెంపుచేయడం అభినందనీయం.

– నరహరశెట్టి శ్రీహరి, జాతీయ కాపు సమాఖ్య

ఎస్సీలకు అత్యంత ప్రాధాన్యం



రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తుంది. బడ్జెట్‌లో ఎస్సీల సంక్షేమానికి రూ.20,005 కోట్లు కేటాయించడమే అందుకు నిదర్శనం. ప్రభుత్వం అమలు చేస్తున్న డైరెక్ట్ బెనిఫిట్ స్కీమ్స్‌తో అమ్మఒడి, విద్యాదీవెన, చేయూత, అనేక పథకాల ద్వారా ఎస్సీలు లబ్ధి పొందుతున్నారు.

–బుర్రి జగ్జీవన్‌రావు, జనరల్ సెక్రటరీ, ఏపీఎస్సీ యునైటెడ్ ఫ్రంట్

మైనార్టీలకు అద్వితీయమైన కేటాయింపులు



రాష్ట్రంలోని మైనార్టీలకు జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అద్వితీయమైన కేటాయింపులు చేసింది. మైనార్టీలకు సంబంధించి రూ.4,203 కోట్లు కేటాయించడం పట్ల ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు. గత ఏడాది రూ.3,662 కోట్లు కేటాయించగా నేడు దానిని రూ.4,203 కోట్లకు పెంచడం ఆనదంగా ఉంది.

– షేక్ ఆసిఫ్, చైర్మన్, ఏపీ స్టేట్ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్

అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర బడ్జెట్

కాపు నేత ఆకుల శ్రీనివాస్ కుమార్



భవానీపురం(విజయవాడపశ్చిమ): అభివృద్ధి, సంక్షేమం ప్రధాన అంశాలుగా సీఎంవైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్ రాష్ట్ర దశ దిశ మార్చేలా ఉందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకులు, కాపు నేత ఆకుల శ్రీనివాస్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా సాహసోపేతమైన నిర్ణయం తీసుకుని కాపు సంక్షేమానికి రూ.4,887 కోట్లు కేటాయించడం అభినందనీయమని పేర్కొన్నారు. కాపుల జీవితాల్లో వెలుగులు నింపాలని కాపు నేస్తం పథకం ద్వారా రూ.550 కోట్లు కేటాయించిన సీఎం జగనన్నకు ధన్యవాదాలు తెలిపారు. కాపులకు మాయమాటలు చెప్పి మభ్యపెట్టి గద్దెనెక్కిన తరువాత వారిని మోసం చేయడం చంద్రబాబు నైజమని పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో కూడా కాపులు సీఎం జగనన్న వెంటే నడిచి వైఎస్సార్ సీపీని అత్యధిక మెజారిటీతో గెలిపిస్తారని స్పష్టం చేశారు.

బాలికలు శారీరక, మానసిక దృఢత్వంతో ఉండాలి

విజయవాడ స్పోర్ట్స్: బాలికలు శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండాలని సమగ్ర శిక్ష అభియాన్ అడిషనల్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ జి.మహేశ్వరరావు సూచించారు. రాణి లక్ష్మీభాయి ఆత్మ రక్ష ప్రశిక్షాన్ పథకంలో భాగంగా పాఠశాలల విద్యార్థినులకు రాష్ట్ర ప్రభుత్వం తైక్వాండోలో శిక్షణ ఇస్తున్న విషయం తెలిసిందే. రామవరప్పాడులోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో కొనసాగుతున్న శిక్షణ శిబిరాన్ని మహేశ్వరరావు గురువారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ బాలికల్లో ఆత్మస్థైర్యాన్ని నింపడానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అనంతరం తైక్వాండో కోచ్‌లు పి.గౌరీశంకర్, పి.సుబ్బయ్య బాలికలకు ఇస్తున్న శిక్షణను పరిశీలించారు. కేజీబీవీ స్కూల్స్ నోడల్ అధికారి శాంతి తదితరులు పాల్గొన్నారు.

త్యాగమూర్తి.. పొట్టి శ్రీరాములు

ఘనంగా అమరజీవి జయంతి వేడుకలు



పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి



నివాళులర్పిస్తున్న మేయర్ రాయన భాగ్యలక్ష్మి, వీఎంసీ అధికారులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగమూర్తి అని ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు కొనియాడారు. విజయవాడ అర్బన్ జిల్లా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో గురువారం వన్‌టౌన్‌లో పొట్టిశ్రీరాములు జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే వెలంపల్లి.. పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర సాధనకు అశువులు బాశారన్నారు. టీడీపీ ప్రభుత్వం పొట్టి శ్రీరాములను అవమానించిందన్నారు. నేడు జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పొట్టి శ్రీరాములు జయంతి, వర్ధంతి కార్యక్రమాలను అధికారికంగా చేయాలని ఉత్తర్వులు జారీ చేసిందని వివరించారు. కార్యక్రమంలో అర్బన్ జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు పల్లపోతు మురళీకృష్ణ (కొండపల్లి బుజ్జి), విజయవాడ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు కొనకళ్ల విద్యాధరరావు, ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర మాజీ అధ్యక్షులు పెనుగొండ సుబ్బరాయుడు, కార్పొరేటర్ గుడివాడ నరేంద్ర రాఘవ, ఆర్యవైశ్య సంఘ నాయకులు అన్నం రామకృష్ణారావు, పాకూరి రమేష సాదు సత్యనారాయణ శేగు వెంకటేశ్వరరావు, గొంట్ల మోహనరావు, బచ్చు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

భవానీపురం(విజయవాడపశ్చిమ): వాసవి క్లబ్ విద్యాధరపురం ఆధ్వర్యంలో విద్యాధరపురం గుప్తా సెంటర్‌లోని శ్రీకన్యకాపరమేశ్వరి కల్యాణ మండపం సమీపంలోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం పేదలకు అల్పాహారం అందచేశారు, క్లబ్ డిస్ట్రిక్ట్ ప్రోగ్రామ్ ఆఫీసర్ చక్కా విజయ నరేంద్ర కుమార్. క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు వంకాయల పూర్ణచంద్రరావు, కందేపు ప్రవీణ్‌కుమార్, కోశాధికారి సముద్రాల పుల్లారావు, కొత్తమాసు పిచ్చయ్య, సభ్యులు ఉన్నారు.

పటమట(విజయవాడతూర్పు): పొట్టి శ్రీరాములు త్యాగం చిరస్మరణీయమని మేయర్ రాయన భాగ్యలక్ష్మి చెప్పారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలో గురువారం పొట్టి శ్రీరాములు జయంతి కార్యక్రమం జరిగింది. అమరజీవి చిత్రపటానికి మేయర్ భాగ్యలక్ష్మి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ (ప్రాజెక్ట్స్) కె.వి సత్యవతి, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి.రత్నావళి, పట్టణ సాధికారాభివృద్ధి ప్రాజెక్ట్ అధికారి శకుంతల, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, మేనేజర్ బి.శ్రీనివాసరావు, వీఎంసీ ఇతర అధికారులు పాల్గొన్నారు.

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వాసవి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సామారంగంచౌక్‌లోని పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద ఆయన జయంతి కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఫౌండేషన్ చైర్మన్ వీవీకే నరసింహారావు, కాంగ్రెస్ నగర అధ్యక్షులు నరహరశెట్టి నరసింహారావు, బీజేపీ రాష్ట్ర కమిటీ సభ్యుడు అడ్డూరి శ్రీరామ్, నాయకులు రామమోహనరావు తదితరులు నివాళులర్పించారు.

బస్టాండ్(విజయవాడ పశ్చిమ): పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్‌లో జరిగిన వేడుకల్లో ఆర్టీసీ విజయవాడ జోన్–2 ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గిడుగు వెంకటేశ్వరావు తొలుత పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వకృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రజా రవాణా ప్రాంతీయ అధికారి జాన్ సుధాకర్, బస్‌స్టేషన్ డెప్యూటీ సీటీఎం బషీర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.



పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డీసీపీ మేరీ ప్రశాంతి

భవానీపురం(విజయవాడపశ్చిమ): ప్రాణత్యాగం చేసిన మహనీయుడు పొట్టి శ్రీరాములని రూరల్ డెప్యూటీ పోలీస్ కమిషనర్ మేరీ ప్రశాంతి పేర్కొన్నారు. పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా గురువారం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ఆమె అమరజీవి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నందిగామ ఏసీపీ నాగేశ్వరరెడ్డి, పోలీస్ అధికారులు, సీఎస్‌బీ, సీపీఓ అధికారులు పాల్గొన్నారు.



సామరంగం చౌక్‌లో..



మాట్లాడుతున్న ఆర్టీసీ ఈడీ గిడుగు వెంకటేశ్వరరావు



గుప్తాసెంటర్‌లో అల్పాహారం ఇస్తూ..

గంగానమ్మకు ప్రత్యేక పూజలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): రామలింగేశ్వరపేట గంగానమ్మ దేవాలయ 8వ వార్షికోత్సవం గురువారం ఘనంగా జరిగింది. ఆలయ అర్చకులు బుర్రా వెంకట సాయిమోహన్‌శర్మ అమ్మవారికి విశేష పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం చండీహోమం చేశారు. సాయంత్రం అమ్మవారి గ్రామోత్సవం జరిగింది. గ్రామోత్సవాన్ని కార్పొరేటర్ చన్నగిరి రామ్మోహన్‌రావు ప్రారంభించారు. శుక్రవారం మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

బ్యూటీషియన్ కోర్సులో శిక్షణ

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతులకు మూడు నెలల బ్యూటీషియన్ కోర్సులో ఉచిత శిక్షణ ఇవ్వనున్నామని జనశిక్షణ సంస్థాన్ డైరెక్టర్ ఎ.పూర్ణిమ గురువారం ప్రకటనలో తెలిపారు. 15 నుంచి 45 సంవత్సరాల లోపు ఉన్న మహిళలు శిక్షణకు అర్హులని పేర్కొన్నారు. ఈ నెల 25 తేదీలోగా మొగల్రాజపురం రావిచెట్టు సెంటర్‌లోని తమ సంస్థ కార్యాలయంలో నేరుగా గానీ 0866–2470420 నెంబరులో కానీ సంప్రదించాలని సూచించారు.

సగరల అభివృద్ధికి సీఎం జగన్ కృషి



సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): సగరల అభ్యున్నతికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని ఏపీ సగర సంఘం గౌరవ అధ్యక్షుడు తాడిశెట్టి నాగేశ్వరరావు పేర్కొన్నారు. సత్యనారాయణపురంలోని గాయత్రి ఫంక్షన్ హాల్లో గురువారం ఏపీ సగర సంఘం ప్రతినిధుల సమావేశం నిర్వహించారు. తొలుత వారు కనకదుర్గదేవాలయానికి సగర జాతికి చెందిన కర్నాటి రాంబాబు నియమించినందుకు సీఎం జగన్ మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం నాగేశ్వరరావు మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సగర కార్పొరేషన్ ఏర్పాటు చేసి వారికి అన్ని రంగాల్లో ప్రాధాన్యమివ్వడం హర్షణీయమని కొనియాడారు. ఈ నెల 19న తుమ్మలపల్లి కళాక్షేత్రంలో సగర సంఘం ఆధ్వర్యంలో కర్నాటి రాంబాబుకు ఆత్మీయ సత్కారం చేయనున్నామని తెలిపారు. కార్యక్రమంలో సంఘ కార్పొరేషన్ డైరెక్టర్ నక్కా శ్రీనివాసరావు, నక్కా గోపాలరావు, గుర్రం రాంబాబు, గుర్రం ఏడు కొండలు, కలవకొల్లు శ్రీనివాసరావు, నక్కా ప్రభుదాసు తదితరులు పాల్గొన్నారు.